




కోటవురట్ల మండలం గొట్టివాడ ఘాట్‌రోడ్డు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా నది

జడివాన!

జిల్లాను వీడని వర్షాలు

- రాంబిల్లిలో 15 సెంటీమీటర్లు!
- ఎనిమిది మండలాల్లో వంద మిల్లీమీటర్లకుపైబడి నమోదు

తుమ్మపాల (అనకాపల్లి), సెప్టెంబరు 1: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరాన్ని దాటినప్పటికీ జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే వున్నాయి. పలు మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని అన్ని నదుల్లో వరద పెరిగింది. శారదా, పెద్దేరు, బొడ్డేరు, తాండవ, వరహా, సర్పా, తదితర నదులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదులకు ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలకు రెవెన్యూ జలవనరుల శాఖల అధికారులు అప్రమత్తం చేశారు. సాగునీటి చెరువుల్లోకి నీరు చేరుతున్నది. ఇప్పటికే నిండిన చెరువుల్లో అదనపు నీరు పొర్లుకట్టల మీదగా దిగువకు ప్రవహిస్తున్నది. లోతట్టు భూముల్లో పంటలు నీటమునిగాయి. కాగా అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం శనివారం రాత్రి 8.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు రాంబిల్లి మండలంలో అత్యధికంగా 147 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మాడుగుల మండలంలో 41.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో వర్షపాతం వివరాలను పరిశీలిస్తే.. పరవాడలో 119.8 మిల్లీమీటర్లు, ఎలమంచిలిలో 117.4, అచ్యుతాపరంలో 116.4, మునగపాకలో 114.7, బుచ్చెయ్యపేటలో 106.8, నక్కపల్లిలో 103, అనకాపల్లిలో 101, పాయకరావుపేటలో 92.4, ఎస్.రాయవరంలో 81.8, దేవరాపల్లిలో 75.3, కె.కోటపాడులో 73.6, కశింకోటలో 72.0, గొలుగొండలో 71.6, సబ్బవరంలో 66.9, కోటవురట్లలో 65.6, నాతవరంలో 62.4, మాకవరపాలెంలో 62.2, రావికమతంలో 57.9, రోలుగుంటలో 51.4, చోడవరంలో 51.4, నర్సీపట్నంలో 50.6, చీడికాడలో మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

'తాచేరు' రోడ్డుపై భారీ వాహనాలు బంద్

బస్సులు, లారీల బస్సుల రాకపోకలు నిలిపివేత

ప్రయాణికుల ఇబ్బందులు



తాచేరు డైవర్షన్ రోడ్డులో ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతు పనులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 1: భారీ వర్షాలకు తాచేరు నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బీఎన్ రోడ్డులో విజయరామరాజుపేట వద్ద డైవర్షన్ రోడ్డు కోతకు గురై దెబ్బతిన్నది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు డైవర్షన్ రోడ్డుపై నుంచి బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. దీంతో బస్సుల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. కాగా పాడేరు, మాడుగుల వెళ్లే బస్సులను విజయరామరాజుపేట, అప్పలరాజుపురం మీదుగా; విశాఖపట్నం, అనకాపల్లి వైపు వెళ్లే బస్సులను కేబీ రోడ్డు మీదుగా మళ్లించారు.

నిండిన తాండవ

- గరిష్ఠస్థాయికి చేరిన రిజర్వాయర్ నీటి మట్టం
- రెండు స్పిల్‌వే గేట్లు ఎత్తివేత
- 1,200 క్యూసెక్కులు నదిలోకి విడుదల



నిండుకుండలా తాండవ జలాశయం

నాతవరం, సెప్టెంబరు 1: పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో తాండవ రిజర్వాయర్‌లోకి వరద నీరు పోటెత్తింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, శనివారం అర్ధరాత్రికి 1,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 378.8 అడుగులకు చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు రెండు స్పిల్‌గేట్లు ఎత్తి, అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తాండవ నది తీరంవెంబడి వున్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని అధికారులు తెలిపారు. కాగా జలవనరుల శాఖ ఈఈ స్వామినాయుడు, ప్రాజెక్టు డీఈ అనురాధ ఆదివారం ఉదయం జలశయాన్ని, స్పిల్‌వే గేట్లను పరిశీలించారు. ఇన్‌ఫ్లో అధికంగా వున్నందున నీటి విడుదలను మరింత పెంచాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

జలాశయాల్లోకి వరద...

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయంలోకి 400 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా ఆదివారం సాయంత్రం 98 మీటర్లకు చేరింది. గత ఏడాది సెప్టెంబరు ఒకటిన నీటిమట్టం 94.5 మీటర్లు మాత్రమే వుంది.



తాండవ రిజర్వాయర్ స్పిల్‌వే గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు.

దేవరాపల్లి: రైవాడ జలాశయంలోకి పినకోట చల్లగెడ్డ, సమ్మెద గెడ్డల నుంచి 500 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, ఆదివారం పాయంత్రానికి 108.37 మీటర్లుగా నమోదైంది.

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయంలోకి సుమారు 300 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, ఆదివారంనాటికి 134.5 మీటర్లుగా నమోదైంది.



అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించిన దృశ్యం

నూకాంబిక అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ

శ్రావణ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా బాలాలయంలోని నూకాంబిక అమ్మవారికి వేలాది పసుపుకొమ్ములు, వేపాకులతో అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కొంతమంది మొక్కులు చెల్లించుకున్నారు.

-అనకాపల్లి టౌన్

నేడు పాఠశాలలకు సెలవు

తుమ్మపాల (అనకాపల్లి), సెప్టెంబరు1: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించి తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భారీ వర్షాలతో పలు రైళ్లు రద్దు

విజయవాడ సమీపంలో వరద ప్రభావం

- 14 దూర ప్రాంత బస్సు సర్వీసులను రద్దుచేసిన ఆర్టీసీ

భారీ వర్షాల కారణంగా విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు రైల్వేస్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరాల్సిన ఒరిజినేటింగ్ రైళ్లను రద్దు చేశారు. హైదరాబాద్ వైపు వెళ్లే పలు రైళ్లు వున్నాయి. ఇక విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడం, రహదారులను వరద నీరు ముంచెత్తడం, కొన్ని చోట్ల రోడ్లు, వంతెనలు బలహీన పడడంతో విజయవాడ, ఆపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సుల్లో కొన్నింటిని ఆర్టీసీ రద్దుచేసింది. మరి కొన్ని బస్సులను రూట్ మార్చి నడుపుతోంది.

- వివరాలు 7వ పేజీలో....

రహదారుణం

వర్షాలతో మరింత అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ పాలకులు
- చోడవరం- జన్నవరం మధ్య అడుగుకో గొయ్యి
- మూడు మండలాల ప్రజలు నిత్యం ఇబ్బందులు

చోడవరం, సెప్టెంబరు 1:

చోడవరం నియోజకవర్గంలో మూడు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే చోడవరం- కన్నంపాలెం (పీఎస్‌పేట రోడ్డు) రహదారి అత్యంత దారుణంగా మారింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఈ రోడ్డు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. చోడవరం మండలంలోని పలు పంచాయతీలతోపాటు, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు ప్రధానమైన ఈ రహదారి పదేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో దారుణంగా మారిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కొత్తూరు జంక్షన్‌లో రహదారిపై ఏర్పడిన భారీ గోతులు



పీఎస్‌పేట వద్ద గోతులు ఏర్పడి ఆనవాళ్లు లేని తారు రోడ్డు

చోడవరంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పీఎస్‌పేట మీదుగా కన్నంపాలెం వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల రహదారి అభివృద్ధి పనులకు గత ప్రభుత్వం రూ.2.83 కోట్లు మంజూరు చేసింది. టెండర్ దక్కిన కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి, ఈ రోడ్డుకు గ్రాంటు లేదని తెలియడంతో కొద్ది రోజులకే ఆపేశారు. తరువాత సాధారణ ఎన్నికల ముందు మళ్లీ పనులు మొదలుపెట్టి కన్నంపాలెం నుంచి జన్నవరం జంక్షన్ వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు పని పూర్తి చేసి ఆపేశారు. జన్నవరం జంక్షన్ నుంచి చోడవరం వరకు పనులు చేయలేదు. అప్పటికే రహదారిపై అడుగడుగునా గోతులు ఏర్పడి అధ్వానంగా వుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ... మిగతా 8వ పేజీలో



మార్టూరు వద్ద వర్షపు నీటితో కుంటలను తలపిస్తున్న గోతులు

బాబోయ్ మార్టూరు రోడ్డు!

- భారీ గోతులతో ఛిద్రమైన రహదారి



మార్టూరు జంక్షన్‌కు సమీపంలో రోడ్డు అంతటా ఏర్పడిన భారీ గోతులు



మాకవరం జంక్షన్ వద్ద గోతులతో బురదగా మారిన రోడ్డు

తుమ్మపాల, సెప్టెంబరు 1: అనకాపల్లి మండలంలో మార్టూరు నుంచి కోడూరు జంక్షన్‌కు వెళ్లే రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా మార్టూరు- మాకవరం మధ్య దాదాపు ఐదు కిలోమీటర్ల మేర పలుచోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గోతుల్లో నీరు చేరి చెరువుల్లో తయారయ్యాయి. కొన్నిచోట్ల తారురోడ్డు ఆనవాళ్లు లేకపోవడంతో బురదమయమైంది. పాఠశాలలు, కళాశాలల్లో చదివే విదార్థులు, ఉద్యోగులు, కార్మికులతోపాటు వివిధ పనుల నిమిత్తం తుమ్మపాలతోపాటు అనకాపల్లికి రాకపోకలు సాగించే మార్టూరు, పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం, సీహెచ్ ఎన్‌అగ్రహారం, మాకవరం తదితర గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుకు ఇరువైపులా రాయి క్వారీలు, స్టోన్ క్రషర్లు ఉండడంతో నిత్యం భారీ వాహనాల రాకపోకలతో మరింత దారుణంగా తయారైంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మార్టూరు రోడ్డు అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేసిందని, కనీసం గోతులు అయినా పూడ్చాలని పలుమార్లు అధికారులకు, వైసీపీ ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

విద్యార్థులపై ఫీజులుం!

ముక్కు పిండి వసూలు చేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

- డిగ్రీ, ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులు చేస్తున్న వారిపై ఒత్తిడి
- తరగతులకు, మిడ్, సెమిస్టర్ పరీక్షలకూ అనుమతించమని హుకుం
- అప్పులు చేసి చెల్లిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- ఈ విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చేరుతున్న వారిదీ అదే పరిస్థితి

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

పెండింగ్ ఫీజులు వెంటనే చెల్లించండి... వారినే తరగతులకు అనుమతిస్తాం.. మిడ్, సెమిస్టర్ పరీక్షలకు కూడా అనుమతించేది లేదు. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు లేవు... ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. మొత్తం ఫీజు చెల్లించాల్సిందే.

- ఇదీ అనకాపల్లిలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు ఇచ్చిన ఆదేశం.

ఒక్క ఈ కళాశాలే కాదు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అనేక కళాశాలలు ఫీజుల విషయంలో విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బకాయిలు పేరుకుపోవడం, కూటమి ప్రభుత్వం నుంచి చెల్లింపులపై ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో విద్యార్థుల నుంచి ఫీజు బకాయిలను రాబట్టుకునే పనిలో కళాశాలల యాజమాన్యాలు పడ్డాయి. దీంతో ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇతర వృత్తి విద్యా కోర్సులు చేస్తున్న విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.



పేరుకుపోయిన బకాయిలు...

వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించినప్పటికీ గత ప్రభుత్వం చెల్లింపులు జరపలేదు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో వాటన్నింటినీ విద్యార్థులే చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. నేరుగా కాలేజీ యాజమాన్యాలకే ఫీజులు చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిందని, అయినప్పటికీ తమను వేధిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థికంగా ఇబ్బందులున్నప్పటికీ యాజమాన్యాలతో వాదనలకు దిగలేక చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లిస్తున్నారు. కళాశాలల యాజమాన్యాల వ్యవహారశైలిపై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

అన్ని కళాశాలలదీ అదే బాట..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఆ శాఖకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్ ఫీజులు విడుదల చేస్తామని హామీఇచ్చారు. ఇకపై నేరుగా కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని స్పష్టంచేశారు. అయితే మంత్రి ఆదేశాలను పట్టించుకోని జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యాకోర్సులు నిర్వహించే కళాశాలల యాజమాన్యాలు బకాయిలు చెల్లించాలంటూ విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. గత విద్యా సంవత్సరానికి సంబంధించి పెండింగ్ బకాయిలను విద్యార్థుల నుంచి బలవంతంగా వసూలుచేస్తున్న యాజమాన్యాలు, ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారి ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రైలు నుంచి జారిపడి వివాహిత మృతి



నీరజ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 : రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి శనివారం రాత్రి వివాహిత మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె. శాంతా రామ్ తెలిపారు. అనకాపల్లి మండలం మార్టూరు గ్రామానికి చెందిన సాలాపు నీరజ (24) తన అన్న ఆశోక్‌తో శ్రీకాళహస్తిలో శనివారం ఉదయం పూజలు చేసి తిరిగి స్వగ్రామానికి బయలుదేరిందన్నారు. ఆమె సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించడం వల్ల అనకాపల్లిలో ఆగని కారణంగా దువ్వాడలో దిగిపోయిందన్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో విశాఖ నుంచి తిరుపతి వెళ్లే డబుల్ డెక్కర్ రైలులో దువ్వాడ నుంచి అనకాపల్లికి బయలుదేరింది. రైలు అనకాపల్లిలో ఆగిన త ర్వాత మెట్ల పైనుంచి దిగుతుండగా ప్రమాదవశాత్తూ ప్లాట్‌ఫారానికి రైలుకు మధ్య పడిపోయిందన్నారు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను వెంట ఉన్న అశోక్, అతని స్నేహితుడు బయటకు తీసి చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాల యానికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తరువాత మృతి చెందినట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు.

కారు, లారీ ఢీ : ఇద్దరికి గాయాలు

మాకవరపాలెం, సెప్టెంబరు 1: మండలంలో ఆదివారం సాయంత్రం కారు, లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మాకవర పాలెం నుంచి వెంకన్నపాలెం వెళుతున్న కారు.. తాళ్లపాలెం నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న లారీ వెంకన్నపాలెం వద్ద ఢీకొన్నాయి. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అలాగే కారులో ఉన్న ఐదుగురిలో చీపురుపల్లి దుర్గానాయుడు, దుంగల వరహాలరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దామోదర్‌నాయుడు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల ఉద్యోగి అనుమానాస్పద మృతి

నర్సీపట్నం, సెప్టెంబరు 1 : నర్సీపట్నంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పా ఠశాల ఉద్యోగి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ ఉమామ హేశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి.

నర్సీపట్నం పురపాలక సంఘం 28వ వార్డు అయ్యన్నకాలనీకి చెందిన ఒ బ్బలరెడ్డి హిమ పరమేశ్వరరావు(56) ఏఎస్ఆర్ జిల్లా డౌనూరు గిరిజన సంక్షే మ ఆశ్రమ పాఠశాల (బాలురు)లో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. ఆగస్టు 30వ తేదీన నర్సీపట్నం శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న తల్లి దగ్గరకు వెళ్లి అక్కడి నుంచి ఉద్యోగానికి వెళతానని భార్యకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. రెండు రోజులుగా ఇంటికి వెళ్లలేదు. ఆదివారం బలిఘ ట్టం ఉత్తరవాహినికి వెళ్లే రోడ్డులోని 133/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురు గా దోబీఘాట్ వద్ద ఉరి వేసుకొని కనిపించాడు. భార్య శివరామయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని పట్టణ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

370 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

చింతపల్లి, సెప్టెంబరు 1: ఒడిశా సరిహద్దు నుంచి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతికి సిద్ధం చేసిన 370 కిలోల గంజాయిని పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్టు అన్నవరం పోలీసు స్టేషన్ ఎస్‌ఐ పి.రాజారావు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి.

చింతపల్లి మండలం బలపం పంచాయతీ ఇటుకబెండలు గ్రామానికి చెం దిన ఇద్దరు ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో శనివా రం సాయంత్రం ఎస్‌ఐ, పోలీసులు ఇటుకబెండలు గ్రామ శివార్లలో దాడి చేసి గంజాయి పట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన తిమురు సోమ లింగం, తిమురు అప్పారావులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న గం జాయి విలువ రూ.18.5 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ రాజారావు తెలిపారు. నింది తులను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆస్పత్రుల వద్ద కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన

▸▸ వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద నిరసన

అనకాపల్లి టౌన్/ఎలమంచిలి, సెప్టెంబరు 1: వేతనాల కోసం అనకాప ల్లి ఎన్టీఆర్ వైద్యాలయం, ఎలమంచిలి సీహెచ్‌సీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆదివారం ఆయా ఆస్పత్రుల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. శ్రమకు తగ్గ ఫలితం లేకపోగా, వేతనాల చెల్లింపుల్లో సైతం జాప్యం చేయడం తగదన్నారు. ఈ నెల 15వ తేదీలోగా చెల్లించకుంటే విధు లను బహిష్కరిస్తారని హెచ్చరించారు. అనకాపల్లిలో జరిగిన ఆందోళనలో ఎస్.సంతోష్, వరప్రసాద్, వెంకటలక్ష్మి, వడ్డాది అప్పలరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు. ఎలమంచిలి సీహెచ్‌సీ వద్ద జరిగిన ఆందోళనలో యూనియన్ ప్రతిని ధులు తాటిపాకల చిన్న అప్పారావు, శ్రీనివాస్, అనిల్‌కుమార్, సంతోషి, వెంకట ల క్ష్మి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన విద్యుత్ పునరుద్ధరణ పనులు

▸▸ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. ఈమేరకు ఆది వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదే శించినట్టు వెల్లడించారు. అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రిని, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. వర్షాల వల్ల ఐదు సర్కిళ్ల పరిధిలోని తొమ్మిది మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లకు, 56 వ్యవసాయ సర్వీసు కనెక్షన్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడగా యుద్ధప్రాతిపదికన సరిచేసినట్టు చెప్పారు. వినియోగదారులు నుంచి టోల్ ఫ్రీ నెంబర్ 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు వచ్చిన 2,583 ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసుకుని, క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేశారన్నారు. ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కరించినట్టు తెలిపారు. వర్షాల ప్రభావంతో తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన స్తంభాలు, పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలకు టోల్‌ఫ్రీ నెంబర్ 1912తోపాటు కంట్రోల్ రూమ్ నెంబర్లు కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 94906 12633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 73822 99975, రాజమండ్రి 73822 99960, ఏలూరు 94409 02926లను సంప్రతించాలని చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

పొంగుతున్న సర్పా, వరాహా, తాండవ నదులు

కోటవురట్ల/పాయకరావుపేట రూరల్/ అనకాపల్లి టౌన్, సెప్టెంబరు1: వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు జిల్లాలో నదులు, వాగులు పొంగుతున్నాయి. వరద నీటితో సర్పా, వరాహా, తాండవ, శారదా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి.

పోటెత్తిన సర్పా, వరాహా నదులు

కోటవురట్ల మండలంలో సర్పా, వరాహా నదులు ఉధృతంగా ప్రవ హిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు వచ్చి చేరడంతో నిండుకుంటున్నాయి. గొట్టివాడ, ఇందేశమ్మ ఘాట్‌రోడ్డుపై కొండ చరియలు విరిగి పడుతు న్నాయి. దీంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా 'తాండవ'

పాయకరావుపేట మండలంలో తాండవ నది పరవళ్లు తొక్కుతోంది. సత్యవరం వద్ద తాండవ నది బ్రిడ్జిని ఆనుకుని ప్రవహిస్తోంది. సత్యవరం బ్రిడ్జి వద్ద స్తంభాలకు అడ్డంగా తాటిచెట్లు, తూటికాడ నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడంతో సర్పంచ్ నఖిలేటి రాము ఎక్స్‌కవేటర్ సాయంతో వాటిని తొలగింపజేశారు.



అనకాపల్లి టౌన్ : వరద నీటితో పరవళ్లు తొక్కుతున్న శారదానది



పాయకరావుపేట రూరల్ : సత్యవరం బ్రిడ్జి వద్ద పొంగి ప్రవహిస్తున్న తాండవ నది

శారదా నది పరవళ్లు

అనకాపల్లి పట్టణంలోని శారదా నది పరవళ్లు తొక్కుతోంది. బంగాళాఖా తంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. రెండు రోజుల క్రితం వరకు ఓ మోస్తరుగా ఉన్న శారదా నది ఆదివారం నుంచి వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. వినాయక నిమ జ్జన ఘాట్ వరకు నీటి ప్రవాహం వచ్చింది. నదుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వాయర్లలో పెరుగుతున్న నీటి మట్టాలు

మాడుగుల రూరల్/చీడికాడ/దేవరాపల్లి/రావికమతం, సెప్టెంబరు 1: వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు జిల్లాలోని పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల నీటి మట్టాలు పెరుగుతున్నాయి. జలాశయాల్లోకి వరద నీరు వచ్చి పడుతోంది.

పెరిగిన పెద్దేరు నీటిమట్టం

మాడుగుల మండలం రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 134.50 మీటర్లకు చేరింది. గరిష్ఠ నీటి మట్టం 137 మీటర్లు కాగా..ఆదివారం 287 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 134.50 మీట ర్లకు చేరింది. ఖరీఫ్ సీజన్‌లో జలాశయం ఆయకట్టుకు ప్రస్తుతం కుడి, ఎడమ కాలువలకు చెరొక 60 క్యూసెక్కులు చొప్పున 120 క్యూసెక్కులు నీటిని స్పిల్‌వే ద్వారా విడిచి పెడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతు న్నా తక్కువగా ఇన్‌ఫ్లో వస్తోందని, నీటిమట్టం 136 మీటర్ల పైబడితే గే ట్లు ఎత్తి విడిచిపెడతామని ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

నిండుకుండలా 'కోనాం'

చీడికాడ మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం ఆదివారం ఉదయానికి 98 మీటర్లకు చేరుకుంది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో జలాశయంలోకి నీరు వచ్చి చేరడంతో నిండుకుండలా మారింది. జలాశయం గరిష్ఠ నీటి మట్టం 101.25 మీటర్లు కాగా.. ప్రస్తుతం 98 మీటర్లకు చేరింది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు కాగా.. ఎగువ, దిగువ కాలువల ద్వారా 130 క్యూసెక్కులు సాగునీరు విడుదల చేస్తున్నట్టు ఏఈఈ సీహెచ్ జయరాం పడాల్ తెలిపారు. గత ఏడాది ఇదే నెల 1వ తేదీ నాటికి 94.50 మీటర్ల నీటిమట్టం ఉంది. గత ఏడాది కంటే అధిక నీటి మట్టానికి చేరుకో వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



చీడికాడ : వరద నీరుతో కళకళలాడుతున్న కోనాం జలాశయం

'రైవాడ'లోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

దేవరాపల్లి మండలంలోని రైవాడ జలాశయంలో నీటి మట్టం పెరి గింది. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, ఆదివారానికి 108.37 మీటర్లకు చేరింది. గత ఏడాది ఇదే రోజుకు 108 మీటర్లు నమోద యింది. జలాశయంలోకి చల్లగెడ్డ, సమ్మెద గెడ్డల నుంచి 500 క్యూసెక్కు ల వరద నీరు వచ్చి చేరుతున్నది. విశాఖ నగర పాలక సంస్థకు 50 క్యూసెక్కులు, వ్యవసాయం కోసం ఆయకట్టుకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

గరిష్ఠ స్థాయికి 'కల్యాణపులోవ'



రావికమతం : కల్యాణపులోవ నీటిని విడిచి పెడుతున్న దృశ్యం

రావికమతం: మండలంలో కల్యాణపులోవ జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటి ని విడిచి పెట్టామని ఏఈ సత్యనారాయణదొర తెలిపారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 460 అడుగులు కాగా, ప్రస్తుతం 459.03 అడుగులకు నీటి మట్టం చేరిందన్నారు. వర్షాలకు జలాశయంలో 200 క్యూసెక్కుల ఇ న్‌ఫ్లో వచ్చి చేరుతోందన్నారు. ఇన్‌ఫ్లోను అనుసరించి రిజర్వాయర్ నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు స్థిరీకరిస్తున్నామన్నారు.

భారీ వర్షాలతో పలు రైళ్లు రద్దు

▸▸ విజయవాడ సమీపంలో వరద ప్రభావం

విశాఖపట్నం, సెప్టెంబరు 1: భారీ వర్షాల కారణంగా విజయవాడ డివిజన్‌లోని రాయనపాడు రైల్వేస్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరాల్సిన ఒరిజినేటింగ్ రై ళ్లను రద్దు చేశారు. వీటిలో విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727). విశాఖ-గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (127739), విశాఖ-లోకమాన్య తి లక్ టెర్మినస్ (ఎల్‌టీటీ ఎక్స్ ప్రెస్) (18519), విశాఖ-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20708), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046), సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704), మహబూబ్‌నగర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (12862), హైదరాబాద్-విశాఖ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728), సికింద్రాబాద్-విశాఖ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740) ఉన్నాయి. వీటితో పాటు విశాఖ-సికింద్రాబాద్ దురంతో ఎక్స్‌ప్రెస్ (22203), విశాఖ-సికిం ద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12783), నాందేడు-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20812), మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863), హౌరా-పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్ (12867), హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12839), షాలిమార్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ (22642), హటియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835),పూరి-చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22859), పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (17479)లను రద్దుచేశారు.

కాగా విశాఖ నుంచి విజయవాడ బయలుదేరిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను (12717) నూజివీడు స్టేషన్‌లో, విశాఖ నుంచి తిరుపతి/ క డపకు బయలుదేరిన తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను (17488) సామర్లకోట వద్ద నిలిపివేశారు. ఇక విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను (17220) సోమ వారం రద్దుచేసినట్టు అధికారులు ప్రకటించారు.

నేడు రద్దు చేసిన రైళ్లు

విశాఖ-సికింద్రాబాద్- విశాఖ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20834), నాందేడు-సంబల్‌పూర్ నాగావళి ఎక్స్‌ప్రెస్ (20810) రద్దు చేశారు. జత రేక్ కొరత కారణంగా ఈనెల 3న (మంగళవారం) లోకమా న్యతిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520), హౌరా-సికింద్రా బాద్ ఫలక్‌నూమా ఎక్స్‌ప్రెస్ (12703) రైళ్లను రద్దు చేశారు. సంబల్‌పూ ర్-నాందేడు నాగావళి ఎక్స్‌ప్రెస్‌ను (20809) విశాఖ రైల్వేస్టేషన్‌లో నిలిపి వేశారు. విశాఖ-నాందేడు రైలు ను రద్దు చేశారు. హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703), హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045), టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189), విశాఖ-హైదరా బాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-తిరుపతి/కడప తిరుమల ఎక్స్‌ప్రెస్(17488), విశాఖ-తిరుపతి డబల్ డెక్కర్ (22707), విశాఖ-లిం గంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), విశాఖ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (22869), విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583), విశాఖ-మ హబూబ్‌నగర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12861), తిరుపతి-విశాఖ డబల్ డెక్కర్ (22708), భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (12715), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12842), షాలిమార్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841), మైసూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (22818), మహబూబ్‌నగర్-విశాఖ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12862), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), సంబల్‌పూర్-నాందేడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20809), భువనేశ్వర్-బెం గుళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463), భువనేశ్వర్- ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) రద్దు చేశారు. విశాఖ-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రె స్ (12727), విజయవాడ-విశాఖ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను (12718) ఈనెల 2, 3 తేదీల్లో; గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను (12739) ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు, విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను (12740) ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు, గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రె స్‌ను (17243) ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ను (17244) ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు రద్దు చేసినట్టు రైల్వే అధికారులు ప్రకటించారు.

రైల్వేలో హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేశా రు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్లకు చేరాల్సిన వారి సమాచారానికి సంబంధించిన వివరాలను తెలిపేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌తోపాటు హెల్ప్ లైన్ ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు. హెల్ప్ లైను ఫోన్ నంబర్లు....విశాఖ 0891-2746330, 0891-2744619; విజయనగరం 8712641260, 08922-221202; శ్రీకాకుళం రోడ్డు 08942-286213, 08942-286245 సంప్రదించవచ్చునని తెలిపారు.

14 దూరప్రాంత బస్సులు రద్దు

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 1: విజయవాడ, గుంటూరు ప్రాం తాల్లో భారీ వర్షాలు కురియడం, రహదారులను వరద నీరు ముంచెత్త డం, కొన్నిచోట్ల రోడ్లు, వంతెనలు బలహీనపడడంతో విజయవాడ, ఆపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సుల్లో కొన్నింటిని ఆర్టీసీ రద్దుచేసింది. మరికొన్ని బస్సులను రూట్ మార్చి నడుపుతోంది. ఆదివారం విశాఖ నుం చి నెల్లూరు వెళ్లాల్సిన రెండు సర్వీసులు, గుంటూరు వెళ్లాల్సిన రెండు, తె నాలి వెళ్లాల్సిన రెండు, కనిగిరికి వెళ్లాల్సిన రెండు, హైదరాబాద్ వెళ్లాల్సిన రెండు బస్సులను రద్దుచేసింది. వినుకొండ, నూజివీడు, కర్నూలు, విజయ వాడ వెళ్లాల్సిన ఒక్కో సర్వీసును రద్దుచేసింది. విజయవాడ వెళ్లాల్సిన బస్సుల్లో కొన్నింటిని అక్కడి వరద ప్రభావిత ప్రాంతం ముందున్న బస్టా పు వరకు నడుపుతోంది. అత్యవసరంగా విజయవాడ, పరిసర ప్రాంతాల కు వెళ్లాల్సిన ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు నడుపుతోంది.

కాగా పాడేరు వెళ్లాల్సిన బస్సులన్నింటినీ రూటు మళ్లించి నడుపుతు న్నారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షా లతో చోడవరం-వడ్డాది మధ్య ఓ బిడ్జి పూర్తిగా బలహీన పడింది. దాని మీదుగా ప్రయాణికులను రవాణా చేయడం సురక్షితం కాదని భావించిన ఆర్టీసీ అధికారులు ఆరు బస్సులను రూటు మళ్లించి నడుపుతున్నారు. భ ద్రాచలం వెళ్లాల్సిన బస్సులను కూడా రూట్ మార్చిమని తెలిపారు. విశా ఖ నుంచి హైదరాబాద్, విజయవాడ వెళ్లేందుకు బయల్దేరిన బస్సులు సురక్షితంగా గమ్యానికి చేరుకునేందుకు స్టేజి టు స్టేజి రూట్ పొజిషన్ తెలుసుకున్న తరువాతనే ముందుకు సాగుతున్నాయి. దురుగా వస్తున్న బస్సు డ్రైవర్ల నుంచి రోడ్డు సమాచారం తెలుసుకుని ముందుకు వెళ్తు న్నారు. ఎక్కడైనా ప్రతి కూల పరిస్థితి ఎదురైతే ముందు స్టేజీలోనే కొద్ది సేపు బస్సును నిలిపివేస్తున్నారు. దీనివల్ల షెడ్యూల్ సమయం కంటే ఆ లస్యంగా బస్సులు నడుస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సోమవా రం కూడా ఇదే పరిస్థితి కొనసాగవచ్చని భావిస్తున్నారు.

రైళ్లు దారి మళ్లింపు.. గమ్యం కుదింపు

విశాఖపట్నం, సెప్టెంబరు 1: భారీ వర్షాల ప్రభావంతో సోమ వారం పలు రైళ్లను రద్దుతోపాటు మరికొన్ని రైళ్లను మళ్లింపు మార్గంలో నడపడం, గమ్యం కుదింపు చర్యలు తీసుకున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. ఈనెల2న విశాఖ నుంచి నిజాముద్దీన్ వెళ్లే స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804) వయా విజయనగరం, రాయగడ, టిట్లాగర్, రాయపూర్, నాగపూర్ మీదుగా, హైదరాబాద్ నుంచి షాలిమార్ వెళ్లే ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (08046) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడవనున్నాయి. ఆదివారం (1న) వివిధ ఒరిజినేటింగ్ స్టేష న్లలో బయలుదేరిన రైళ్లలో విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), పూరి-వేఖా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20819) వయా విజయనగరం, రాయగడ, టిట్లాగర్, రాయపూర్, నాగపూర్ మీదుగా; నిజాముద్దీన్-విశా ఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804) వయా నాగపూర్, రాయపూర్, టిట్లాగర్, విజయనగరం మీదుగా; భువనేశ్వర్-ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) వయా గుంటూరు, నల్గొండ, పగిడిపల్లి మీదుగా నడి పారు. అలాగే, షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045) వయా గుంటూరు, నల్గొండ, పగిడిపల్లి మీదుగా; లోకమాన్య తిలక్ టెర్మి నస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా; ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్‌ఎక్స్‌ప్రెస్ (11019) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తున్నాయి.

గుణుపూర్, కిరండోల్ పాసింజర్లకు అదనపు స్లీపర్ క్లాసు కోచ్

నిరీక్షణ జాబితా ప్రయాణికుల సౌకర్యార్థం గుణుపూర్, కిరండోల్ పాసింజర్ రైళ్లకు అదనంగా ఒక స్లీపర్ క్లాసు కోచ్‌లను జత చేస్తున్నా మని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-గుణుపూర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న 08522, 08521 పాసింజర్ రైళ్లకు ఈనెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు తాత్కాలికంగా ఒక అదనపు స్లీపర్ క్లాసు కోచ్‌ను జత చేసినట్టు పేర్కొన్నారు.

కృష్ణాదేవిపేట జూనియర్ కళాశాల అధ్యాపకుడికి అవార్డు



ఎ.శ్రీనివాసరావు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 1: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచే స్తున్న జువాలజీ అధ్యాపకుడు అంకంరెడ్డి శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ స్కూల్ ఇన్నోవేటివ్ సంస్థ జాతీయ స్థాయిలో విద్యారంగంలో విశిష్ట సేవలు అందించే 50 మంది అధ్యాపకులకు పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇందులో శ్రీనివాసరావుకు స్థానం లభిం చింది. ఈ పురస్కారాన్ని ఆయన సెప్టెంబర్ 15న జైపూర్‌లో అందుకోనున్నారు. ఈ అవార్డుకు ఎంపిక కావడంతో శ్రీనివాసరావును కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, అదనపు ప్రిన్సిపాల్ రుత్తల గంగరా జు, సహచర అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు అభినందనలు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

▸▸ విజేతలకు ఎమ్మెల్యే కొణతాల బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

కొత్తూరు, సెప్టెంబరు 1: అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో పురుషులు 78 మంది, మహిళలు 76 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో బెస్ట్ లైఫర్స్ ఉమెన్ విభాగంలో శ్రీకాకు ళం జిల్లాకు చెందిన జి.హర్షిత ప్రథమ స్థానం, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కె.హేమశ్రీ ద్వితీయ స్థానం, కడప జిల్లాకు చెందిన జి.రాజ్యలక్ష్మి తృతీయ స్థానం కైవసం చేసుకున్నారు. అలాగే సబ్ జూనియర్ ఉమెన్ విభాగంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.హర్షిత ప్రథమ, విజయనగరం జిల్లాకు చెందిన ఎం.శ్రీలక్ష్మి ద్వితీయ, కడప జిల్లాకు చెందిన ఎం.సత్యవతి తృతీయ స్థానాల్లో నిలిచారు. జూనియర్ ఉమెన్స్ విభా గంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కె.తరంగిణి ప్రథమ, విజయనగరం జిల్లాకు చెందిన ఎ.యశశ్రీ ద్వితీయ, కర్నూలుకు చెందిన ఒ.గాయత్రి తృతీయ, సీనియర్ ఉమెన్ విభాగంలో విజయనగరం జిల్లాకు చెందిన సిహెచ్.శ్రీలక్ష్మి ప్రథమ, విజయన గరం జిల్లాకు చెందిన బి.నాని ద్వితీయ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి.లలిత తృతీయ స్థానాల్లో నిలిచారు. పురుషుల బెస్ట్ లిటర్స్ విభాగంగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.తరుణ్ ప్రథమ, కడపకు చెందిన జి.రవికుమార్ ద్వితీయ, పశ్చిమ గోదావరికి చెందిన సిహెచ్.వినయ్‌కుమార్ తృతీయ స్థానాలు సాధించారు. సబ్ జూనియర్ మెన్ విభాగంలో కడప జిల్లాకు చెందిన డి.భానుతేజ ప్రథమ, గుంటూరుకు చెందిన టి.తరుణ్ ఆదిత్య ద్వితీయ, విజయనగరం జిల్లాకు చెందిన ఎస్.భాస్కరరావు తృతీయ స్థానాలను గెలుచుకున్నారు. జూనియర్ మెన్ విభాగంలో విజయనగరానికి చెందిన ఎస్.గురునాయుడు ప్రథమ, పశ్చిమ గోదావరికి చెందిన బి.వి.కృష్ణ ద్వితీయ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.తరుణ్ తృతీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్ మెన్ విభాగంలో విజయనగరానికి చెందిన ఎస్.గురునాయుడు ప్రథమ, అనకాపల్లికి చెందిన ఎస్.కె.లాల్ బషీర్ ద్వితీయ, పశ్చిమ గోదావరికి చెందిన ఎ.అరుణేష్‌బాబు తృతీయ స్థానాలను సాధించారు. వీరికి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మెమెంటోలను అందజేశారు. ఈ కా ర్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నీలంశెట్టి లక్ష్మి, ఒలింపియన్ ఎం.వి.మాణిక్యాలరావు, అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనా యుడు, అసోసియేషన్ ప్రతినిధులు జీస్సబాబు, కె.సూర్యనారాయణ, బి.రామయ్య, గుమ్మాల వెంకటరామ తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని టీచర్ల ఆందోళన



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్‌లకు వ్యతిరేకంగా ఉపాధ్యా యులు ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు తమరాన త్రినాథ మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తామని చేయలేదు సరికదా జీపీఎస్‌ను తీసుకురావడం అన్యాయమన్నారు. రాష్ట్ర కార్యదర్శి సల్మాన్‌రాజ్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరా రు. ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయకపోతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ డీటీ రామ్మూర్తికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్య క్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, ప్రధానకార్యదర్శి ఎస్. దుర్గాప్రసాద్, వై. శ్రీనివాసరావు, బి. దేముడుబాబు, ఎండీకే జయలక్ష్మి, పడాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణకు వినతి



కొణతాలకు వినతిని అందిస్తున్న సీపీఎస్ఈఏ ప్రతినిధులు

కొత్తూరు, సెప్టెంబరు 1 : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కోరుకొండ సతీష్ వినతి పత్రాన్ని అందజేశారు. ఆదివారం విద్రోహ దినంగా పాటిస్తూ సీపీఎస్ ఉద్యోగులు పలువురు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. వీటిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానన్నారు. ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర గౌరవ సలహాదారు రొంగలి అప్పలరాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గౌరినాయుడు, జిల్లా అదనపు కార్యదర్శి చిన్నారావు, జిల్లా కార్యదర్శి రమణారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా జలమే

» ఎలమంచిలో శేషు గెడ్డకు తగ్గిన వరద » కాలువల్లో వ్యర్థాల తొలగింపు

» పులపర్తి, కృష్ణాపురం రహదారిలో కూలిన భారీ చెట్టు

» 'పేట'లో ఉధృతంగా 'తాండవ' ప్రవహిస్తుండడంతో అధికారులు అప్రమత్తం



పాయకరావుపేట ఏటి ఒడ్డు వీధిలో తాండవ నదిని పరిశీలిస్తున్న అధికారులు

ఎలమంచిలి, సెప్టెంబరు 1 : వాయుగుండం కారణంగా గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీంతో ఎటుచూసినా జలమే కనిపిస్తోంది. అయితే ఎలమంచిలి పట్టణంలో శనివారం సాయంత్రం ఉప్పొంగిన శేషుగెడ్డకు ఆదివారం వరద కాస్త తగ్గుముఖం పట్టింది. ఫలితంగా ఉదయం నుంచి ఎక్స్‌కవేటర్ సహాయంతో శేషుగెడ్డ కాలువ వెంబడి ఉన్న వ్యర్థాలను మునిసిపల్ ఏఈ గణపతి సుబ్బారావు పర్యవేక్షణలో తొలగించడంతో నీరు యథావిధిగా ముందుకు పారింది. శనివారం రాత్రి పులపర్తి, కృష్ణాపురం గ్రామాలకు వెళ్లే రహదారి సమీపంలో ఓ భారీ చెట్టు నేలకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్టైంది. కూలిన చెట్టు వల్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు కొమ్మలను తొలగించారు.



ఎలమంచిలి పరిధిలోని పులపర్తి, కృష్ణాపురం రోడ్డులో కూలిన చెట్టు

పాయకరావుపేట/రూరల్ : తాజా వర్షాలకు పాయకరావుపేట వద్ద తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం నది పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ జయప్రకాశ్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ ఏఈ శ్రీరామ్మూర్తి తదితరులు పట్టణంలోని నదిని ఆనుకుని ఉన్న నాగరాజుపేట, పాండురంగస్వామి ఆలయం వెనుక ప్రాంతంలోని ఏటి ఒడ్డువీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. సత్యవరం, మాసాహెబ్‌పేట గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రామాల్లో కూటమి ఆధ్వర్యంలో క్లీన్-గ్రీన్



మొక్క నాటి, నీరు పోస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సబ్బవరం, సెప్టెంబరు 1 : కూటమి నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం క్లీన్- గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా చెత్తాచెదారాన్ని తొలగించారు. సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీలో మూడు నెలల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో రమేశ్‌నాయుడు, కూటమి నాయకులు బర్నికాన బాబూరావు, మహాలక్ష్మినాయుడు, కనకరాజు, తాతారావు, ప్రకాశ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 : ఇక్కడి లక్ష్మీదేవిపేటలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. తొలుత ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. టీడీపీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ తదితరులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భర్నికాన శ్రీనివాసరావు, టి.కనకరాజు, ఇసరపు రమేష్, పాము సన్యాసిరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వారాది సంతోష్, భర్నికాన లోకేశ్, పి.వంశీకృష్ణ పాల్గొన్నారు.

'మట్టి గణపతినే పూజిద్దాం'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 : ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల వద్ద ప్రజలకు ఆదివారం మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్ప పుస్తకాలు, పసుపు, కుంకుమలు పంపిణీ చేసి మాట్లాడారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీపీ నారాయణరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, క్లబ్ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ, రాజేష్, బీరా వినోద్‌కుమార్, యల్లపు సూరిఅప్పారావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల బకాయిలు చెల్లించాలి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 1 : ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలను తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా మొదటి మహాసభ ఆదివారం ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటైన సందర్భంగా మాట్లాడారు. కార్మికులకు ఆరు నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పలువురు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.





వేట సాగక.. పూట గడవక..

» వాయిగుండంతో ఆర్థిక ఇబ్బందుల్లో మత్స్యకారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 1: తుఫాన్ కారణంగా గత వారం రోజులుగా చేపల వేట లేక మత్స్యకారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూడిమడకలో 18 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరందరికీ చేపల వేటే ప్రధాన జీవనాధారం. ప్రతి రోజూ చేపల వేటకు వెళ్లి వస్తేనే గాని వీరికి రోజు గడవదు. అటువంటిది వారం నుంచి సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో వీరు చేపల వేటకు వెళ్లలేదు. ఫలితంగా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. పురుషులు చేపల వేటకు వెళ్లి చేపలు తెస్తే మత్స్యకార మహిళలు వాటిని గ్రామాల్లో విక్రయిస్తుంటారు. వారం రోజుల నుంచి చేపల వేట కొనసాగకపోవడంతో ఆదాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువులను ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

'స్వర్ణాంధ్ర స్వాప్నికుడు చంద్రబాబు'

మునగపాక/కశింకోట/నక్కపల్లి, సెప్టెంబరు 1 : స్వర్ణాంధ్ర స్వాప్నికుడు చంద్రబాబు అని మునగపాక టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు అన్నారు. చంద్రబాబునాయుడు మొదటిసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఇక్కడ సంబరాలు జరుపుకున్నారు వైస్ ఎంపీపీ ఉల్లింగల గోవింద్, నాయకులు ఆడారి జనార్థన్, దొడ్డి రమేష్, సబ్బి శ్రీనివాసరావు, పొలమరశెట్టి మురళి, సూరిశెట్టి శివాజీ, మొల్లేటి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కశింకోట మండలం సుందరయ్యపేటలో టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కూటమి నేతలు పాల్గొన్నారు. అదేవిధంగా నక్కపల్లిలోని ఐటీడీపీ బృందం సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస్, రమేష్, సతీష్, వంశి, దమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సీఐలు బాధ్యతల స్వీకరణ

అచ్యుతాపురం/ పరవాడ, సెప్టెంబరు 1 : జిల్లాలో జరిగిన సీఐల బదిలీల్లో పోస్టింగ్‌లు పొందిన అధికారులు ఆయా సర్కిళ్లలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ విధుల్లో చేరారు. అలాగే పరవాడ సీఐగా ఆర్.మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు.

'పేట' సీఐగా అప్పన్న

పాయకరావుపేట : ఇక్కడి సీఐగా జి.అప్పన్న నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన పి.అప్పలరాజు చోడవరం సీఐగా బదిలీ అయిన విషయం తెలిసిందే. నక్కపల్లి సీఐగా పనిచేస్తున్న అప్పన్నను ఉన్నతాధికారులు ఇక్కడికి పంపారు.







ఘనంగా గండి బాబ్జీ జన్మదిన వేడుకలు




అనాథాశ్రమంలో దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న వంశీదీప్

సబ్బవరం, సెప్టెంబరు 1 : మాజీ ఎమ్మెల్యే, టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాబ్జీ స్వగ్రామం మొగలిపురంలో ఆయన తనయుడు వంశీదీప్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. పెందుర్తి, పరవాడ, సబ్బవరం మండలాల నుంచి పలువురు కార్యకర్తలు విచ్చేసి రక్తదానం చేశారు. గొటివాడ జనరేషన్ యువ అనాథాశ్రమంలో పిల్లలకు బాదిరెడ్డి లక్ష్మణ సమకూర్చిన దుప్పట్లు, దుస్తులు పండ్లను వంశీదీప్ పంపిణీ చేశారు. ఇరువాడలో బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు బాబూరావు, మహాలక్ష్మినాయుడు, బంగారు నాయుడు, పైల జగన్నాథరావు, పీలా శ్రీనివాసరావు, గండి దేముడు, నానాజీ, రేసుపూడి రమణ, చైతన్య, బాదిరెడ్డి లక్ష్మణ, ఆడారి నాగరాజు, బొండా కల్యాణ్, వడిశల రమేశ్, గొంప సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.









ఉద్యోగ భద్రత కల్పించాలని శాంతి ర్యాలీ

సబ్బవరం, సెప్టెంబరు 1 : రాష్ట్ర వ్యాప్తంగా 2019 నుంచి 2024 వరకూ ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సుమారు 15వేల మంది సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సబ్బవరంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్య షాపులను ప్రైవేటుకు ఇచ్చే విధంగా ప్రయత్నిస్తున్నందున తమ జీవితాలు రోడ్డునపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పర్యావరణ హితానికి మట్టి విగ్రహాలే వాడాలి

మునగపాక, సెప్టెంబరు 1 : పర్యావరణ హితానికి అంతా మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని స్పందించే హృదయం సంస్థ అధ్యక్షుడు తమ్మిరాజు పేర్కొన్నారు. పాటిపల్లి గ్రామంలో ఆదివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో 'మట్టి వినాయకుడు.. పర్యావరణ పరిరక్షకుడు' అన్న నినాదంతో ర్యాలీ నిర్వహించారు.











విద్యార్థులపై ఫీ'జులుం'!

... 5వ పేజీ తరువాయి

నుంచీ కూడా ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలామంది ఫీజులు చెల్లించేశారు. అయితే పూర్తి ఫీజుచెల్లిస్తేనే మిడ్, సెమిస్టర్ పరీక్షలకు అనుమతిస్తామని హెచ్చరిస్తుండడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

నష్టపోయిన విద్యార్థులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలో విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు నష్టపోయారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యా దీవెన సొమ్మును వైసీపీ ప్రభుత్వం ఒకే ఒక్క విడత విడుదల చేసింది. మిగిలిన మూడు విడతలు పెండింగ్‌లో పెట్టడంతో విద్యార్థులే చెల్లించారు. వసతి దీవెన కింద విద్యార్థులకు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, ఒక ఏడాది రూ.10 వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. అంటే ఒక్కో విద్యార్థికి ఏడాదికి పది వేలు చొప్పున నాలుగేళ్లపాటు రూ.40వేలు బకాయి పెట్టింది. ఈ మొత్తాన్ని వారు పూర్తిగా నష్టపోయారు. గతంలో మాదిరిగా ప్రభుత్వమే నేరుగా కాలేజీలకు ఫీజులు చెల్లించి ఉంటే ఇబ్బందులు తప్పేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

రహదారుణం...

... 5వ పేజీ తరువాయి

వెంటనే వర్షా కాలం మొదలుకావడంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి వీలు లేకపోయింది. కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గోతుల్లో నీరు చేరి, పంట కుంటలను తలపిస్తున్నాయి. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల ప్రయాణం కష్టతరంగా మారింది. గోతుల కారణంగా ఆటోలు పాడైపోతున్నాయని, నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో డీజిల్ వినియోగం అధికమవుతున్నదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు.

నీటి పథకాల నిర్వహణపై నిర్లక్ష్యం

» మరమ్మతుకు గుర్రైనా పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు » 4 రోజులుగా తాగునీరు లేక రెండు గ్రామాల ప్రజల ఇక్కట్లు

రావికమతం, సెప్టెంబరు 1 : చినపాచిల, మత్స్యపురం గ్రామాల్లో మంచి నీటి పథకాలు మూలకు చేరాయి. ఫలితంగా ఈ రెండు గ్రామాల ప్రజలకు వర్షాకాలంలోనూ తాగునీటి సమస్య తలెత్తింది. చినపాచిలలో అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఉన్న రక్షిత మంచి నీటి పథకం వాల్వు పాడవడంతో ట్యాంకులోకి ఎక్కిన నీరు నిల్వ ఉండక ఎక్కిన నీరు ఎక్కినట్టే పైకి వృథాగా పోతోంది. కొళాయిలకు తాగు నీరు సరఫరా కావడం లేదు. ఫలితంగా పెంకుల కాలనీ, నాయుడోరి వీధి, స్లాబు కాలనీలకు తాగునీరు అందని పరిస్థితి ఎదురైంది.

అలాగే ఇదే పంచాయితీ మత్స్యపురంలో రక్షిత మంచి నీటి పథకం మోటారు కాలిపోయింది. నాలుగు రోజులుగా మోటారు మరమ్మతులకు గుర్రైనా పట్టించుకునే వారే లేరు. ఇక్కడ ఉంటున్న సుమారు 500 మంది జనాభా గల ఈ గ్రామస్థులకు తాగునీరు అందించేందుకు 10 వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత పథకం ఉన్నా ఫలితం లేకుండా పోతోంది. ఇక్కడ ఉన్న రెండు చేతిబోరుల్లో ఒకటి పని చేయడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


మోటారు కాలిపోయిన మత్స్యపురం నీటి పథకం


కాలిపోయిన మోటారును చూపిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఈ విషయమై చినపాచిల సర్పంచ్ కోమటి రామలక్ష్మి వద్ద సంప్రదించగా.. ఈ రెండు రక్షిత పథకాలకు మరమ్మతు చేయాలని కోరుతూ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుజాత దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే ఆమె బదిలీ కావడంతో పనులు చేపట్టంతో జాప్యం జరుగుతోందని తెలిపారు. జేఈ సుజాతను అడగ్గా.. తనకు చినపాచిల పంచాయతీ నుంచి ఇంతవరకూ ఎలాంటి తీర్మాణం ఇవ్వలేదన్నారు. తీర్మానం ఇస్తే ఎస్టిమేట్స్ వేస్తామన్నారు.

మెట్ట రైతులకు మేలు చేసిన వాన

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 1 : మండలంలోని మెట్ట ప్రాంత రైతులను బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ఆదుకుంది. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు అంతంతమాత్రంగా కురవడంతో ఎర్రవాయి ప్రాంతంలో ఇంతవరకూ వరినాట్లు వేయలేదు. ఆకు ముదిరిపోవడంతో నాట్లుపై ఆశలు వదులుకునే సమయంలో అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పొలాలు, చెరువులో నీరు చేరింది. దీంతో మల్లాం, ఆర్.శివరామపురం, ఆర్.భీమవరం, రాజాం, లైపురం, పెదమదీన, చింతపాక, కొండెంపూడి, కేపీ అగ్రహారం, దిబ్బిడి, పి.భీమవరం, కొండెంపూడి, గొన్నవానిపాలెం గ్రామాల్లో వరినాట్లు జోరందుకున్నాయి. ట్రాక్టర్లతో దమ్ములు, ఆకుతీత, గట్టువేత పనులు, వరినాట్లుతో మెట్ట ప్రాంతంలో పొలాలు సందడిగా మారాయి.


దిబ్బిడిలో వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు

కొమరవోలు ఆవలో చేపలు మృత్యువాత


మృతి చెంది ఒడ్డుకు చేరిన చేపలు

రోలుగుంట, ఆగస్టు 1 : మండలంలోని కొమరవోలు ఆవలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. గత మూడు రోజులుగా భారీ వర్షాల కారణంగా కల్యాణపులోవతో పాటు చుట్టు పక్కల చెరువుల నుంచి భారీ ఎర్ర నీరు చేరుతుంది. దీంతోపాటు ఆవలో గుర్రపు డెక్క తొలగించకపోవడంతో విపరీతంగా నాచు పెరిగి ఉండడం, డ్రైనేజీ నీరు చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ పరిస్థితుల్లో ఒక్కసారిగా రెండు రోజుల నుంచి అధిక సంఖ్యలో చేపలు చనిపోయి ఒడ్డుకు చేరుతున్నాయి. ఈ చేపలు కుళ్లిపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. వర్షాల నేపథ్యంలో ఆవ అడుగున ఆక్సిజన్ కొరత కారణంగా చేపలు మృతి చెందాయా? లేదా మృత్యువాతకు ఏవైనా ఇతర కారణాలు ఉన్నాయా? అంటూ స్థానిక రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

మోదకొండమ్మకు పూజలు

మాడుగుల, సెప్టెంబరు 1 : మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజాము ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు.

వర్షాలకు అధ్వానంగా రహదారులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 1 : రెండు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలతో మండలంలో రహదారులు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో వర్షం పడగానే నీరు చేరి తటాకాల్లా కనిపిస్తున్నాయి. ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి కింతలి వెళ్లే మార్గంలో పరిస్థితి దారుణంగా ఉంది. ఎదురుగా భారీ వాహనాలు వచ్చేటప్పుడు తప్పుకోవడం కష్టంగా మారింది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తున్నప్పుడు ఫీట్లు చేస్తున్నట్టుగా కనిపిస్తున్నది. వీరు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాగా వడ్డాది-పాడేరు ఆర్ అండ్ బీ రోడ్డులో భాగమైన కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ఘాట్‌రోడ్డు జంక్షన్ వరకు ఉన్న రోడ్డు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఈ ఏడాది మార్చి నెలలో ఎన్నికల ముందు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవ తీసుకుని కేజేపురం జంక్షన్ నుంచి ఘాట్‌రోడ్డు జంక్షన్ వరకు పలు చోట్ల మరమ్మతులు జరిగేలా చూశారు. అయితే భారీ వాహనాల వాహనాల రాకపోకలు వల్ల రోడ్డు గోతులు పడి వర్షాలు కురుస్తుండడంతో నీరు చేరి సమస్యగా మారుతోంది.


వాడపాడు వద్ద గోతుల్లో చేరిన వర్షం నీరు

పొంగుతున్న వాగులు.. లోతట్టు ప్రాంతాలు జలమయం


నాతవరం : పొంగి ప్రవహిస్తున్న పార్లగెడ


నాతవరం ఎంఈవో కార్యాలయం వద్ద విరిగిన చెట్టు కొమ్మ


దేవరాపల్లి : బి.కింతాడ చెరకు కాటా వద్ద వర్షం నీటితో నిండిన రోడ్డు

నాతవరం, సెప్టెంబరు 1 : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాతవరంమండలంలో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. అలాగే తాండవనది ఉధృతంగా ప్రవహిస్తుండంతో పొలాలకు వెళ్లే అవకాశం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం వర్షం సమయంలో వీచిన గాలులకు ఎంఈవో కార్యాలయం వద్ద చెట్టు కొమ్మ విరిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మాడుగుల : మాడుగుల కేంద్రంలో గత మూడు రోజులుగా ముసురు వాతావరణం వీడకపోవడంతో వివిధ పనులకు వెళ్లే ప్రజలు, కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. తుపాన్ కారణంగా వాతావరణం ముసురుగా మారి ఎడతెరిపి లేకుండా తేలికపాటి జల్లులు పడుతూ అడపాదడపా ఓ మోస్తారు వర్షం కురిసింది. పంట పొలాల్లోకి నీరు చేరడంతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.


మాడుగుల : జోరుగా కురుస్తున్న వర్షం

మాడుగుల రూరల్ : మండలంలో ఆదివారం తేలికపాటి వర్షం పడింది. ఆకాశమంతా మేఘావృతమై జల్లులు పడుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం కాస్త తెరిపి ఇచ్చి సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి.

దేవరాపల్లి : తుపాను కారణంగా ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లపైకి నీరు చేరి చెరువులను తలపించే విధంగా ఉన్నాయి. శనివారం రాత్రి నుంచి ఇప్పటి వరకు మూడు సెంటీ మీటర్లు వర్షం పడింది. పంట పొలాలు నీరు రోడ్లపైకి పారుతోంది.

వర్షంలో నిండు గర్భిణి ఆస్పత్రికి తరలింపు

దేవరాపల్లి, సెప్టెంబరు 1 : వర్షాల నేపథ్యంలో రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా.. గర్భిణులు, బాలింతలకు తీవ్ర కష్టాలకు లోనవుతున్నారు. వాలాబు పంచాయతీ రామన్నపాలేనికి చెందిన బాలింత తామర్ల లక్ష్మి శనివారం డోలీ మోతపై గ్రామానికి చేరింది. ఇదే గ్రామానికి చెందిన దుంబరి సన్యాసిరావు భార్య నూకాలమ్మ ఈనెల 9న ప్రసవించే అవకాశం ఉందని వైద్య సిబ్బంది నిర్ధారించారు. అయితే తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ప్రసవ సమయంలో ఉన్న గర్భిణులను ముందుగానే దగ్గర్లో ప్రభుత్వాస్పత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎండీఎస్కే. బాలాజీని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. దీంతో గర్భిణులను ఆదివారం ఉదయం ఆస్పత్రులో చేర్పించాలని డీఎంహెచ్‌వో తమ శాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈ క్రమంలో గర్భింగి ఏఎన్ఎం వి.విజయ, ఆశ, కార్యకర్త దేముడమ్మ వర్షం పడుతుండగా నూకాలమ్మను దేవరావల్లికి ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో రోడ్డు సౌకర్యం ఉన్న కోడాపల్లి వరకు రెండు కిలోమీటర్లు కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది సహకారం అందిస్తుండగా నూకాలమ్మ అష్టకష్టాలు పడుతూ నడవాల్సి వచ్చింది. ఆ సమయంలో నిండు గర్భిణీగా ఉన్న ఆమె బాధను చూసిన వారు చలించి పోయారు.


బురదలో నడిపిస్తూ గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఎమ్మెల్యేకు సీపీఎస్ ఉద్యోగుల వినతి


ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు

చోడవరం, సెప్టెంబరు 1 : సీపీఎస్ ఉద్యోగులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు తొలగించాలని కోరుతూ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ ఎన్ఎస్ రాజుకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రోడ్డు మ్యాపు ప్రకటించడంతో పాటు పాత పింఛను విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం విశాఖ, అనకాపల్లి జిల్లాల నేతలు గూనూరు శ్రీను, నేతలు దేముడుబాబు, సూర్యప్రకాశ్, సింహాద్రి, గౌస్ బాబా, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెంపేటలో పవన్ జన్మదిన వేడుకలు

రోలుగుంట, సెప్టెంబరు 1 : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురష్కరించుకుని మండలంలోని బుచ్చెంపేటలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఉలబాల పోతు రాజునాయుడు, జన సైనికుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పిలుపుతో వనం మనం కార్యక్రమంద్వారా గ్రామంలో పచ్చదనం పెంపొందించడానికి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు గాలి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్టు జనసేన పట్టణ అధ్యక్షుడు ఇళ్లపు రమేష్ తెలిపారు. భారీ కటౌట్లు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ మొక్కలను నాటనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి హాజరు కానున్నారని తెలిపారు. తాచేరు సమీపంలో గల పంచాయతీరాజ్ వసతిగృహంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

విద్యార్థులపై ఫీ'జులుం'!

... 5వ పేజీ తరువాయి

నుంచీ కూడా ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే చాలామంది విద్యార్థులు ఫీజులు చెల్లించేశారు. అయితే పూర్తి ఫీజు చెల్లిస్తేనే మిడ్, సెమిస్టర్ పరీక్షలకు అనుమతిస్తామని హెచ్చరిస్తుండడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

నష్టపోయిన విద్యార్థులు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్లలో విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు నష్టపోయారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యా దీవెన సొమ్మును వైసీపీ ప్రభుత్వం ఒకే ఒక్క విడత విడుదల చేసింది. మిగిలిన మూడు విడతలు పెండింగ్‌లో పెట్టడంతో విద్యార్థులే చెల్లించారు. వసతి దీవెన కింద విద్యార్థులకు ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామని ప్రకటించి, ఒక ఏడాది రూ.10 వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. అంటే ఒక్కో విద్యార్థికి ఏడాదికి పది వేలు చొప్పున నాలుగేళ్లపాటు రూ.40 వేలు బకాయి పెట్టింది. ఈ మొత్తాన్ని వారు పూర్తిగా నష్టపోయారు. గతంలో మాదిరిగా ప్రభుత్వమే నేరుగా కాలేజీలకు ఫీజులు చెల్లించి ఉంటే ఇబ్బందులు తప్పేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

తెగుళ్లు ప్రబలకుండా జాగ్రత్తలు అవసరం

» జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు


పంటలను పరిశీలిస్తున్న ప్రభాకరరావు

కె.కోటపాడు, సెప్టెంబరు 1 : కూరగాయల పంటలకు తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు తెలిపారు. ఆదివారం మండలంలోని కె.సంతపాలెం, సూదివలస, పాతవలస గ్రామా ల్లో ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు చేస్తూ కూరగాయల పంటల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలన్నారు. ఆకుమచ్చ, కాయకుళ్ళు, బూజు తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుందని వీటికి ముందు జాగ్రత్త చర్యగా లీటరు నీటికి 2.5 గ్రాముల సాఫ్ మందును కలిపి రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట కె.సంతపాలెం సర్పంచ్ చల్ల మంగ, ఎఫ్‌పీవో మెంబర్ ప్రభాకర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు వ్యవహారం..

ఈవోపై క్రమశిక్షణ చర్యలు?

చోడవరం, సెప్టెంబరు 1 : పట్టణంలోని స్వయంభూ వినాయకుడి గుడి సమీపంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలంలోని ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో పంచాయతీ ఈవోపై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైనట్టు తెలిస్తోంది. డ్రైనేజీల నిర్మాణం కోసం పంచాయతీ స్థలంలో ఉంటున్న నాగలక్ష్మి అనే గృహిణి ఇంటిని, మరో టైర్ల దుకాణం యజమానికి చెందిన దుకాణాన్ని మూడు రోజుల క్రితం తెల్లవారుఝామున పోలీసుల సహాయంతో బలవంతంగా తొలగించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై హైకోర్టులో కేసు ఉన్నప్పటికీ ఈవో వాటిని పూర్తిగా తొలగించడంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. సీపీఐ ఆధ్వర్యంలో బాధితులు ఆందోళన చేపట్టి కొనసాగిస్తున్నారు. జనసేన నేతలు సైతంబాధితులను పరామర్శించి బాధితులకు మద్దతు తెలిపారు.

మరోవైపు.. శనివారం మండల పర్యటనకు వచ్చిన ఎంపీ సీఎం రమేష్‌ను కలిసి తమకు న్యాయం చేయాలంటూ వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఎంపీ రమేశ్ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ ఘటనపై విచారణ చేయాలని ఆదేశించారు. బాధితురాలికి అదే స్థలంలో ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ కూడా ఇచ్చినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఉన్నతాధికారులు, స్థానిక మండల పరిషత్ అధికారులు సైతం తమకు సమాచారం లేకుండా ఈవో తొలగింపు నిర్ణయం తీసుకున్నారంటూ ఉన్నతాధికారులకు నివేదించినట్టు చెపుతున్నారు. దీంతో నివాసాల తొలగింపు వ్యవహారానికి ఈవో నారాయణరావును బాధ్యుడిగా చేస్తూ అతడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది.

ఇల్లు కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం, సీఐటీయూ నేతల డిమాండ్


నాగలక్ష్మిని పరామర్శిస్తున్న సీపీఎం, సీఐటీయూ నేతలు

చోడవరం, సెప్టెంబరు 1 : పట్టణంలోని స్వయంభూ వినాయకుడి గుడి సమీపంలో ఎప్పటి నుంచో నివాసం ఉంటున్న మహిళ అన్నపురెడ్డి నాగలక్ష్మి ఇంటిని అన్యాయంగా కూల్చిన పంచాయతీ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, ఎస్వీ నాయుడు, సీఐటీయూ గూనూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. పంచాయతీ అధికారులు ఇంటిని తొలగించిన స్థలంలోనే ఆందోళన చేస్తున్న నాగలక్ష్మికి సీపీఎం నేతలు మద్దతు ప్రకటించి ఆమెకు న్యాయం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తరహాలోనే చోడవరంలో అధికార పార్టీ నాయకులు బుల్‌డోజర్ రాజకీయాలకు తెరతీశారని, రియల్ వ్యాపారికి అనుకూలంగా పంచాయతీ అధికారులు నిర్ణయాలు తీసుకుని బడుగుజీవులపై తమ ప్రతాపాన్ని ప్రదర్శించడం దారుణమన్నారు. బాధితురాలి కూల్చివేసిన ఇంటిని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు తిరిగి నిర్మించి ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కూలిన ఆలయ ప్రహరీ గోడ



వర్షాలకు నానిపోవడంతో కూలిన గోడ

దేవరాపల్లి, సెప్టెంబరు 1 : తుపాను వర్షం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు స్థానిక ఉమామహేశ్వరీదేవీ ఆలయ ప్రహరీ కూలిపోయింది. ఆదివారం వారపు సంత కావడంతో గోడ ఆనుకొని చాలా మంది వ్యాపారులు దుకాణాలు వేస్తారు. అయితే వర్షం కురవడంతో ఎవరూ అక్కడ దుకాణాలు ఏర్పాటు చేయకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

☛ సంక్షిప్తంగా..

పింఛన్ల తొలగింపుపై ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న దివ్యాంగులు

గొలుగొండ సెప్టెంబరు 1 : పింఛన్లు కోల్పోయిన దివ్యాంగులు ఆదివారం పాకలపాడులో ధర్నా చేపట్టారు. ఈ గ్రామంలో సుమారు 82 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. అయితే వీరిలో 21 మంది తమకు పింఛన్లు తొలగించినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తమకు పింఛన్లు ఇవ్వలేదని, కారణం అడిగితే పింఛనుదారుల జాబితా నుంచి తొలగించినట్టు అధికారులు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్టు చెప్పారు.

4న మెగా రక్తదానం శిబిరం

కృష్ణాదేవిపేట, అక్టోబరు 1 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గొలుగొండ మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమాన్ని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదినంసందర్భంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

మాడుగుల రూరల్, సెప్టెంబరు 1 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం వీరవిల్లి అగ్రహారంలో జనసైనికుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. విశాఖపట్నం ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి వైద్య శిబిరంలో ఉచితంగా తనిఖీలు నిర్వహిస్తారని జనసైనికులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని వారు కోరారు.

ఏఎల్ పురంలో 'గ్రీన్ ఆంధ్రా క్లీన్ ఆంధ్రా'


నాతవరంలో మొక్కలు నాటుతున్న జనసైనికులు

నాతవరం, సెప్టెంబరు 1 : మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయం వద్ద ఆదివారం జనసైనికులు క్లీన్ ఆంధ్రా-గ్రీన్ ఆంధ్రా వనమహోత్సవాన్ని నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జనసేన నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర, బీసీ సంఘం ప్రతినిధి పోలుపర్తి శ్రీనువాసరావు, నేతలు ఎల్.విక్రమ్, మాకిరెడ్డి వెంకటరమణ, ఎంఈవో కార్యాలయ సిబ్బంది టి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జనసేన నాయకులు స్వచ్ఛభారత్ నిర్వహించారు. తుప్పలను తొలగించి పరిసరాలు పరిశుభ్రత చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చిన 'గ్రీన్ ఆంధ్రా క్లీన్ ఆంధ్రా'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండెం దొరబాబు, సీనియర్ నాయకులు రెగుబల్ల సాంబశివ, కార్యదర్శి సలాదుల ప్రసాద్, దుంగల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

మాడుగుల, సెప్టెంబరు 1 : మాడుగుల సామాజిక ఆరోగ్యం కేంద్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి ఎదుట ఆదివారం నిరసన తెలిపారు. 2021 నుంచి రావాల్సిన వేతనానికి తగిన పీఎఫ్ నగదు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన డిమండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 15 నుంచి విధులు బహిష్కరిస్తామని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు లక్ష్మయ్య హెచ్చరించారు.

రహదారుణం...


కొత్తూరు జంక్షన్‌లో రహదారిపై ఏర్పడిన గోతులు

... 5వ పేజీ తరువాయి

వెంటనే వర్షా కాలం మొదలుకావడంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి వీలు లేకపోయింది. కాగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గోతుల్లో నీరు చేరి, పంట కుంటలను తలపిస్తున్నాయి. కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల ప్రయాణం కష్టతరంగా మారింది. గోతుల వల్ల ఆటోలు పాడైపోతు న్నాయని, నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో డీజిల్ విని యోగం అధికమవుతున్నదని ఆటోడ్రైవర్లు వాపోతున్నారు.

ఆటోలు పాడవుతున్నాయి

- బగ్గు రమణబాబు, ఆటో డ్రైవర్, బెన్నవోలు



చోడవరం-పీఎస్‌పేట రోడ్డు నిర్వహణను పదేళ్ల నుంచి పట్టించుకోవడంలేదు. నానాటికీ గోతులు అధికమై, ఆటోల విడిభాగాలు పాడైపోవడమే కాకుండా బోల్తా పడుతున్నాయి. రెండేళ్ల క్రితం ఆటో డ్రైవర్లంతా చందాలు వేసుకుని గోతులు పూడ్చాం. వర్షాల వల్ల పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది.